సాక్షి సిద్దిపేట

బుధవారం । 29 । నవంబర్ । 2023





రఘునందన్‌వి మాయమాటలు

రోడ్ షోలో కొత్త ప్రభాకర్‌రెడ్డి



దుబ్బాకటౌన్: ఉప ఎన్నికల్లో మాయమాటలు చెప్పి గెలిచిన రఘునందన్‌రావు ప్రజలకు ఏం చేసిండో చెప్పాలని బీఆర్‌ఎస్ దుబ్బాక అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి నిలదీశారు. ప్రచారం చివరి రోజైన మంగళవారం పట్టణంలో భారీ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి చౌరస్తాలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దుబ్బాకకు రైలు, రైతులకు ఎడ్లు నాగలి, కార్పొరేట్ ఆస్పత్రి, నిరుద్యోగ భృతితో పాటు ఇలా ఎన్నో హామీలిచ్చిండు కనీసం అందులో ఒక్కటైన అమలు చేసిండా? అని అడిగారు. కత్తి దాడి నుంచి వెంకటేశ్వర స్వామి దయ.. మీ ఆశీస్సులతోనే బతికి బయటపడ్డానని అన్నారు. తనను రాజకీయంగా ఎదుర్కొలేకనే శాశ్వతంగా అంతం చేయాలనే కుట్ర పన్ని దాడి చేయించారని విమర్శించారు. మళ్లీ పునర్జన్మ ఎత్తానని భావోద్వేగానికి గురయ్యారు. మానవత్వం లేని కొందరు స్వార్థ రాజకీయాల కోసం కోడికత్తి అంటూ వ్యంగ్యంగా ప్రచారం చేయడం బాధాకరమన్నారు. తాను తెలిసి ఇప్పటివరకు ఎవరికీ అన్యాయం చేయలేదని తెలిపారు. తనను ఇప్పటికే 2 సార్లు ఎంపీగా గెలిపించారని, ఈసారి ఎమ్మెల్యేగా గెలిపించి అసెంబ్లీకి పంపిస్తే జీవితమంతా రుణపడి ఉంటానన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి సతీమణి మంజులతారెడ్డి, సోలిపేట సతీశ్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి తదితరులు ఉన్నారు.

కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావాలని..

నాచగిరిలో 'ముడుపు' కట్టిన నేత



వర్గల్(గజ్వేల్): కేసీఆర్ గజ్వేల్ నుంచి విజయం సాధించాలని తెలంగాణ పద్మశాలి సంఘం కన్వీనర్ బూర మల్లేశం అన్నారు. మూడోసారి సీఎంగా బాధ్యతలు స్వీకరించాలని కోరుతూ మంగళవారం నాచగిరి శ్రీలక్ష్మీ నృసింహ క్షేత్రంలో ముడుపు కట్టారు. ఆపై ప్రత్యేక పూజలు జరిపించారు.

మంత్రి హరీశ్‌కు జననీరాజనం

సిద్దిపేటలో భారీ రోడ్ షో

సిద్దిపేటకమాన్: బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి హరీశ్‌రావు రోడ్ షో జిల్లా కేంద్రంలో భారీ ఎత్తున కొనసాగింది. మంగళవారం వేములవాడ కమాన్ వద్ద ప్రారంభమైన రోడ్ షో పట్టణంలోని పలు వీధుల గుండా కొనసాగి మోడ్రన్ బస్టాండ్ అంబేడ్కర్ చౌరస్తా వరకు నిర్వహించారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని మంత్రి హరీశ్‌రావుకు మద్దతు తెలిపారు. మహిళలు బతుకమ్మ ఆడి నృత్యాలు చేశారు. హరీశ్‌రావుకు గులాబీలతో పూల వర్షం కురిపించారు. భారీ గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సిద్దిపేట ప్రజలే నా కుటుంబం అని, ఏ పని చేసినా ప్రజలందరికీ మేలు జరగాలని చిత్తశుద్ధితో కష్టపడ్డాను అని అన్నారు. ప్రజల మనసులోని ఆలోచనలు, అభివృద్ధి అనే ఐదేళ్ల పరీక్ష రాశాను అని. ఆ పరీక్ష మార్కులు మీరే వేయండి అని అన్నారు. నా తుది శ్వాస ఉన్నంత వరకూ మీ వెంటే ఉంటానన్నారు. నా చర్మం వలిచి చెప్పులు కుట్టించినా మీ రుణం తీర్చుకోలేనిదని అన్నారు. నేడు సిద్దిపేటను విద్య, వైద్యం, ఉపాధి, ఐటీ సాఫ్ట్‌వేర్, పర్యాటక, ఆధ్యాత్మిక, వ్యవసాయ, పారిశ్రామిక, రవాణ, మహిళా సాధికారత, పారిశుద్ధ్య రంగాల్లో ప్రగతికి రోల్‌మాడల్‌గా తీర్చిదిద్దుకున్నామన్నారు. 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ రోజా శర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు, సుడా చైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



రోడ్ షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి



భారీ గజమాల, పూలవర్షం కురిపిస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

మూగబోయిన మైకులు

- చివరి రోజు హోరెత్తిన ప్రచారం
- పాల్గొన్న ఆయా పార్టీల అగ్రనేతలు
- రేపే పోలింగ్



సాక్షి, సిద్దిపేట: అసెంబ్లీ ఎన్నికలు తుది అంకానికి చేరాయి. పోలింగ్ ముగింపు సమయానికి 48 గంటల ముందు ఎన్నికల ప్రచారానికి తెరపడింది. మంగళవారం చివరి రోజు రాజకీయ పార్టీలన్నీ జోరుగా ప్రచారం నిర్వహించాయి. గజ్వేల్‌లో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ, సిద్దిపేటలో మంత్రి హరీశ్‌రావు రోడ్‌షో నిర్వహించారు. గజ్వేల్‌లో బీజేపీకి మద్దతుగా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ప్రచారం చేశారు. గురువారం పోలింగ్ జరగనున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఇదిలా ఉంటే.. పోలింగ్‌కు ఒక్క రోజు సమయం మాత్రమే ఉండటంతో ఓటర్లను మచ్చిక చేసుకునే పనిలో ఆయా పార్టీల నాయకులు బిజీగా ఉన్నారు. తమ పార్టీ అభ్యర్థికి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- జిల్లావ్యాప్తంగా 1,151 పోలింగ్ కేంద్రాలు
- జిల్లాలో 9, 48,664 మంది ఓటర్లు
- జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్



సిద్దిపేటరూరల్: పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు సిద్ధమని జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్ మంగళవారం తెలిపారు. జిల్లాలోని హుస్నాబాద్, సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్ శాసనసభ నియోజకవర్గాల పరిధిలో 1,151 (హుస్నాబాద్ 304, సిద్దిపేట 273, దుబ్బాక 253, గజ్వేల్ 321) పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 9 లక్షల 48 వేల 664 మంది ఓటర్లు ఈనెల 30న వారి ఓటు హక్కును ఉపయోగించుకోనున్నారని తెలిపారు. ఎన్నికల నిర్వహణ కోసం 1,151 మంది ప్రిసైడింగ్ అధికారులు, 1151 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 2302 మంది అదర్ ప్రిసైడింగ్ అధికారులు విధులు నిర్వహిస్తారని తెలిపారు. వారికి అదనంగా 817 మంది రిజర్వ్ సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు 1,400 మంది జిల్లా పోలీస్ సిబ్బంది, 10 కంపెనీలకు చెందిన 1,000 మంది పారా మిలటరీ సిబ్బంది విధులు నిర్వహిస్తారని తెలిపారు.

దుబ్బాకపై కేసీఆర్‌ది సవతితల్లి ప్రేమ

రోడ్‌షోలో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు విమర్శ





దుబ్బాకటౌన్: తన కొట్లాట అంతా పేద ప్రజల కోసమేనని దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు తెలిపారు. వారి కోసం అడుగేటోడు గెలిస్తే ఇబ్బందవుతుందనే అయ్యా, కొడుకు, అల్లుడు దుబ్బాక మీద పడ్డారని, ఇక్కడి వాళ్లు చైతన్యవంతులు కాబట్టి ఆ కుట్రలను తిప్పికొట్టి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని అన్నారు. ప్రచారం చివరిరోజైన మంగళవారం పట్టణంలో భారీ రోడ్ షో నిర్వహించారు. అనంతరం తెలంగాణ తల్లి చౌరస్తాలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ గడ్డపై అభిమానం ఉందన్న కేసీఆర్ ఇక్కడ ఏం అభివృద్ధి చేసిండో చెప్పాలని ప్రశ్నించారు. ఈ ప్రాంతంపై కేసీఆర్‌కు సవతితల్లి ప్రేమ చూపుతున్నారని అన్నారు. మొదటి నుంచి దుబ్బాక నిధులన్నీ హరీశ్‌రావు సిద్దిపేటకు తరలించుకపోయి తీవ్ర అన్యాయం చేశాడని ఆరోపించారు. ఇక్కడ జరుగుతున్న అన్యాయంపై తాను గెలిచాక ప్రజల గొంతుకనై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీశానన్నారు. గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లకు ఎన్ని నిధులు ఇచ్చారు? దుబ్బాకకు ఎన్ని ఇచ్చిండ్రో చెప్పాలన్నారు. 2016లో రామలింగారెడ్డి అడిగినప్పుడు దుబ్బాకకు రెవెన్యూ డివిజన్ ఎందుకివ్వలేదని, ఇప్పుడు ప్రభాకర్‌రెడ్డి గెలిస్తేనే ఇస్తారా ఇది ఎంత వరకు సమంజసమో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు.

పటిష్ట ఏర్పాట్లు

- సిద్దిపేట సీపీ శ్వేత

గజ్వేల్‌రూరల్: ఎన్నికల నేపథ్యంలో ఇన్సిడెంట్ ఫ్రీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టినట్లు సీపీ శ్వేత పేర్కొన్నారు. పట్టణంలోని కోలా అభిరామ్ గార్డెన్స్‌లో మంగళవారం రూట్ మొబైల్, స్ట్రైకింగ్ ఫోర్స్ అధికారులు, పోలింగ్ కేంద్రం సిబ్బంది, పోలీస్ అధికారులకు పటిష్టమైన బందోబస్తు, ఈవీఎం, వీవీ ప్యాట్ తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. మొత్తం 1009 పోలింగ్ కేంద్రాలుండగా వాటిలో సమస్యాత్మక, క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు 278, సాధారణ పోలింగ్ కేంద్రాలు 731 ఉన్నట్లు తెలిపారు. సరిహద్దు జిల్లాలైన కరీంనగర్, వరంగల్, మెదక్ జిల్లాల పరిధిలో కొన్ని పోలింగ్ కేంద్రాలు కలిసి ఉన్నట్లు చెప్పారు. ప్రశాంతమైన ఎన్నికల నిర్వహణ కోసం 103 మొబైల్ పార్టీలు, 26 క్యూర్టీ(క్విక్ రెస్పాన్స్ టీమ్స్), 6 స్ట్రైకింగ్ ఫోర్స్, 4స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌ను ఏర్పాటు చేశామని వెల్లడించారు. జిల్లాలో జరిగే అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ కోసం మొత్తం 2,632 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని వెల్లడించారు. డిసెంబర్ 1న సాయంత్రం 5 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

సబ్బండ వర్గాలకు న్యాయం చేస్తా



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాకరూరల్: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సబ్బండ వర్గాలకు న్యాయం చేస్తామని ఆపార్టీ దుబ్బాక అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని పోతారెడ్డిపేట, నగరం, తాళ్లపల్లి, రామేశ్వరంపల్లి, చిన్ననిజాంపేట గ్రామాలల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దళితబంధు, బీసీబంధు పథకాలను ఏ ఒక్కరికీ అందించకుండా ఎస్సీ, బీసీ కులాల్లో సీఎం కేసీఆర్ చిచ్చు పెడుతున్నాడని విమర్శించారు. ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్సేనన్నారు. ఇంటికో ఉద్యోగం ఇస్తానని చెప్పి ఏ ఒక్కరికీ కూడా ఉద్యోగం ఇవ్వలేదన్నారు.

యువకుడి ఆత్మహత్య

దుబ్బాక: మద్యానికి బానిసైన యువకుడు ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన దుబ్బాక పట్టణంలో డబుల్ బెడ్రూం ఇళ్లలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ గంగరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దుబ్బాకకు చెందిన నక్క శేఖర్ (39)టీ హోటల్ నిర్వహిస్తూ భార్య రేణుక, కూతురుతో డబుల్ బెడ్రూమ్‌లో ఇంటిలో జీవనం గడుపుతున్నాడు. మద్యానికి బానిసై ఆర్థిక ఇబ్బందులకు గురయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. మృతుడి భార్య రేణుక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



రమేశ్(ఫైల్)

గజ్వేల్‌రూరల్: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు బావిలో పడి మృతి చెందిన ఘటన శ్రీగిరిపల్లిలో మంగళవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దాకూరి రమేశ్(26) వ్యవసాయం చేస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. ఇదే గ్రామానికి చెందిన ఓ యువతితో సన్నిహితంగా ఉండటంతో యువతి కుటుంబీకులు రమేశ్‌తో గొడవకు దిగినట్లు తెలిపారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి తిరిగి రాకపోవడంతో రమేశ్ కుటుంబీకులు అంతటా వెతికారు. వ్యవసాయ బావి వద్ద ద్విచక్ర వాహనం, షర్ట్, పక్కనే చెప్పులు ఉండడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం బావిలో రమేశ్ మృతదేహం తేలి ఉండడాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. యువతి కుటుంబీకులే రమేశ్‌ను హత్య చేసి బావిలో వేసి ఉంటారని బాధిత కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. రమేశ్ మృతదేహంతో యువతి ఇంటి ఎదుట ఆందోళనకు దిగడంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు వారికి నచ్చజెప్పి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

'గండిపల్లిని పూర్తి చేస్తాం'



అభివాదం చేస్తున్న పొన్నం ప్రభాకర్

అక్కన్నపేట(హుస్నాబాద్): తనను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఈ హుస్నాబాద్ నియోజకవర్గ సమస్యలపై అసెంబ్లీలో కొట్లాడతానని కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. మండలం రామవరంలో మంగళవారం ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామాలు, తండాలు, మారుమూల పల్లెల అభివృద్ధి బాధ్యత తనదని చెప్పారు. ప్రతి గ్రామాల్లోని లింక్ రోడ్లన్నీ తారురోడ్లుగా నిర్మిస్తామన్నారు. తండాలకు బీటీ రోడ్లు వేయిస్తామని భరోసానిచ్చారు. గౌరవెల్లి భూ నిర్వాసితులను కడుపులో పెట్టుకొని చూసుకుంటామన్నారు. మూడు నెలల వ్యవధిలో ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామన్నారు. ఈ ప్రాంత్ర చిరకాల కోరికైన గండిపల్లి ప్రాజెక్టును పూర్తి చేసి కాలువల ద్వారా సాగునీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, పార్టీ మండలాధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య, ఉప సర్పంచ్ శేరి కనకయ్య ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమం గెలిపిస్తాయి

- యువతీయువకులకు పోలీస్, ఆర్మీలో శిక్షణ ఇప్పించా
- కాంగ్రెస్‌కు నాయకుడేడి?.. మాకు కేసీఆరే నాయకుడు
- పొన్నం ప్రభాకర్ మాటలే తప్ప చేతలు శూన్యం
- 'సాక్షి'తో బీఆర్‌ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్



ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, బీఆర్‌ఎస్ అభ్యర్థి

హుస్నాబాద్: 'రెండు సార్లు ఈ ప్రాంత ప్రజలు ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించారు. పదేళ్లలో తాను చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి మూడోసారి ఆశీర్వదించడం ఖాయం. యువతీయువకులకు పోలీస్, ఆర్మీలో శిక్షణ ఇప్పించాను. పొన్నం ప్రభాకర్‌వి మాటలే తప్ప చేతలు శూన్యం' అని హుస్నాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. వెల్లడించిన అంశాలు ఆయన మాటల్లోనే..

కుటుంబ సభ్యుడిలా ఆదరిస్తున్నారు..

గ్రామాలకు ఎక్కడికి వెళ్లినా కుటుంబ సభ్యుడిలా ఆదరిస్తున్నారు. పదేళ్ల కాలంలో దాదాపు రూ.9వేల కోట్లతో అభివృద్ధి చేశాం. ప్రతి గ్రామం, మండలం, జిల్లా కేంద్రానికి రోడ్లు వేశాం. ఈ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నం గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేశాను. ఎల్కతుర్తి నుంచి హుస్నాబాద్ మీదుగా సిద్దిపేట వరకు జాతీయ రహదారి మంజూరు చేయించా. పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. మిడ్ మానేర్ ద్వారా చిగురుమామిడి, సైదాపూర్ మండలాలకు గోదావరి జలాలు అందించాం. దేవాదుల, కాకతీయ కెనాల్ ద్వారా ఎల్కతుర్తి, భీమదేవరపల్లికి సాగునీటిని అందించాం. రూ.23కోట్లతో శనిగరం ప్రాజెక్టు, రూ.5కోట్లతో సింగరాయ ప్రాజెక్టు పునర్నిర్మాణం చేసి పుష్కలంగా పంటలు పండించుకునే విధంగా నీటిని అందిస్తున్నాం. హుస్నాబాద్‌కు రెండు సార్లు జాతీయ అవార్డులు వచ్చాయి.

సొంత ఖర్చుతో యువతకు శిక్షణ

పదేళ్ల కాలంలో యువతకు ఉద్యోగ అవకాశాలు వచ్చేలా పోలీస్, ఆర్మీలో ఉద్యోగం సాధించేలా సొంత ఖర్చులతో శిక్షణ ఇప్పించాను. దాదాపు 2వేల మందికి శిక్షణ ఇప్పించగా 35 శాతం మంది ఆయా ఉద్యోగాలు పొందారు. ఇప్పటికే యువతకు ఉపాధి కల్పించేందుకు వంగరలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేశాం. రానున్న రోజుల్లో అన్ని మండల కేంద్రాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పిస్తాం.

కరీంనగర్‌లో చెల్లని నోటు ఇక్కడ చెల్లుతుందా..

కరీంనగర్‌లో చెల్లని నోటు హుస్నాబాద్‌లో చెల్లుతుందా, ఎన్ని మాటలు చెప్పినా ప్రజలు వినేపరిస్థితి లేదు. కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ కరీంనగర్‌లో మూడు సార్లు ఆదరించలేదు. ఎంపీ ఉన్న సమయంలో గౌరవెల్లి ప్రాజెక్టుకు తట్టెడు మట్టి పోయలేదు. పొన్నం ప్రభాకర్ మాటల తప్ప చేతల్లో ఏలాంటి పని చేయడు. నియోజకవర్గ అభివృద్ధికి కేంద్రం నుంచి ఒక్క పైసా తేలేదు. ఎంపీగా ఉన్న సమయంలో కరీంనగర్‌లో ఒక్క మెడికల్ కళాశాల ఏర్పాటు చేయలేదు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నాలుగు మెడికల్ కళాశాలలను మంజూరు చేసిన ఘనత కేసీఆర్‌దే. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే మెడికల్ కళాశాల ప్రకటన చేశారు. కాంగ్రెస్‌కు నాయకుడెవరో తెలవదు. బీఆర్‌ఎస్‌కు మాత్రం కేసీఆరే మా నాయకుడు. పొన్నం ప్రభాకర్ తన ఐదేళ్లలో అభివృద్ధి చేయని ఆయన ఎందుకు బాండ్ రాసిచ్చాడో తమకు అనుమానం కలుగుతోంది.

పీవీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి..

ఇటీవల హుస్నాబాద్‌కు వచ్చిన ప్రియాంక గాంధీ మాజీ ప్రధాని పీవీ న ర్సింహ రావుపై ప్రేమను ఒలకబోసినట్లు మాట్లాడారు. కాంగ్రెస్ ఫ్లెక్సీలో పీవీ ఫొటో, పేరు ఎందుకు పెట్టలేదో చెప్పాలి. పీవీ చనిపోయినప్పుడు ఢిల్లీలో అంత్యక్రియలు చేయకుండా హైదరాబాద్‌కు తీసుకువచ్చి అవమానపర్చారు. మా కుటుంబ సభ్యులందరం కలిసి పీవీ అంత్యక్రియలు వంగరలో చేస్తామని చెబితే హైదరాబాద్‌లోనే అంత్యక్రియలు జరిపారు. పీవీ పేరును ఉచ్చరించే అర్హత కాంగ్రెస్‌కు లేదు. పీవీ నర్సింహారావుపై కాంగ్రెస్‌కు ప్రేమ ఉంటే ఏఐసీసీ కార్యాలయంలో పీవీ విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

నా బలం.. బలగం దుబ్బాక ప్రజలే

- నేను పక్కా లోకల్..
- సిద్దిపేట, గజ్వేల్, సిరిసిల్లకు దీటుగా అభివృద్ధి చేస్తా..
- దుబ్బాకపై పరాయి పెత్తనం సహించేదిలేదు
- భారీ మెజార్టీతో రెండోసారి గెలవబోతున్నా..
- 'సాక్షి'తో దుబ్బాక బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు



భవిష్యత్ ప్రణాళికను చూపుతున్న దుబ్బాక బీజేపీ అభ్యర్థి, ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: 'నేను పక్కా లోకల్.. పుట్టింది దుబ్బాక ఉమ్మడి మండలం బొప్పాపూర్‌లో సామాన్య వ్యవసాయ కుటుంబంలో..పేద ప్రజలు, రైతుల కష్టాలు స్వయంగా తెలిసినోడిని.. చిన్ననాటి నుంచే నాకు ప్రజలకు సేవచేయాలనే దృక్పథం ఉండేది.. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగి పేద ప్రజల జీవితాల్లో వెలుగు నింపాలన్న ఆశయంతోనే విక్రమార్కుడిలా నా ప్రయాణం సాగింది. దుబ్బాక ఉప ఎన్నికల్లో బీజేపీ నుంచి రెండో సారి గెలిచి దేశవ్యాప్తంగా చరిత్ర సృష్టిస్తా..'నని దుబ్బాక బీజేపీ అభ్యర్థి, ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. మంగళవారం 'సాక్షి'తో ముచ్చటించారు. ఆయన వెల్లడించిన విషయాలు ఆయన మాటల్లోనే..

ప్రైవేట్ స్కూల్ టీచర్‌గా నా మొదటి జీవన ప్రయాణం చాలా సంపూర్ణంగా సాగింది. నేను చదువుచెప్పిన నా శిష్యులు చాలా మంది ప్రస్తుతం ఉన్నత స్థాయిలో ఉన్నారు. తర్వాత జర్నలిస్టుగా పనిచేసి చాలా సమస్యలు వెలుగులోకి తెచ్చి ప్రజలకు మేలు చేశా.. ఇక వకీల్.. అయ్యాక నాలో చాలా పరిణితి వచ్చింది.. చట్టం, రాజ్యాంగం చదివిన వ్యక్తిగా సమాజం పట్ల సంపూర్ణ అవగాహన ఏర్పడింది. నేను పక్కా లోకల్ ఇక్కడే పుట్టా.. చస్తే నా కట్టె కాలేది ఈ మట్టిలోనే అన్నారు.

తెలంగాణ ఉద్యమంలోనే రాజకీయ అరంగేట్రం..

2001 లో ఉవ్వెత్తున ఎగిసిపడ్డ తెలంగాణ ఉద్యమం పట్ల ఆకర్షితుడినై.. తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై పోరాడేందుకు కదనరంగంలోకి దూకాను. ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేశా.. ఉమ్మడి మెదక్ జిల్లా టీఆర్‌ఎస్ అధ్యక్షుడిగా ఉండి పార్టీ బలోపేతం కోసం చాలా కృషిచేశాను.. కానీ నా లాంటి తెలివిపరుడు ఉంటే వారి ఆటలు సాగవని నన్ను బయటకు పంపారు. నేను మొండోడిని.. ఎవరికి భయపడను.

నిధులివ్వకుండా అడ్డుకున్నారు..

దుబ్బాక ఉప ఎన్నికల్లో సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుతో పాటు మొత్తం కేబినెట్, పోలీసు అధికారులు ఒక్కటై నన్ను ఎన్నో రకాలుగా ఇబ్బందుల పాలుచేసినా ప్రజలు నాకు అండగా నిలిచి నన్ను గుండెల్లో పెట్టుకొని గెలిపించారు. నాపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేయకకుండా గెలిచిన మూడేళ్లలో దుబ్బాకలో కొత్త బస్టాండ్ తో పాటు 100 పడకల ఆసుపత్రి, ఐటీఐ కళాశాల,ఐ ఓసీ భవనాన్ని ప్రభుత్వాన్ని నిలదీసి నిధులు మంజూరు చేయించి పూర్తి చేశా. అలాగే మల్లన్నసాగర్ భూ బాధితులకు అండగా నిలిచి న్యాయపరంగా దక్కాల్సిన ప్యాకేజిని ఇప్పించా. ఎల్కతుర్తి టూ సిద్దిపేట- దుబ్బాక మీదుగా మెదక్ జాతీయ రహదారిని, దుబ్బాక-ముస్తాబాద్ డబుల్ రోడ్‌ను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించా.

ప్రజల ఆశీస్సులతో రెండోసారి గెలుస్తా

చైతన్యవంతులైన దుబ్బాక ప్రజలే నా బలం.. బలగం, వారి శీస్సులతో రెండోసారి 20 వేలకు పైగా మెజార్టీతో అసెంబ్లీకి వెళ్తానని సంపూర్ణ ధీమాను వ్యక్తం చేశారు. గెలిచాక సిద్దిపేట, గజ్వేల్, సిరిసిల్లకు దీటుగా దుబ్బాకను అభివృద్ధి చేయడమే నా లక్ష్యం. యువతకు ఉద్యోగాలతో పాటు రైతులు, చేనేత, బీడీ కార్మికుల ఉపాధి కోసం కృషి చేస్తా.

భవిష్యత్ ప్రణాళిక వెల్లడి..

రెండోసారి గెలిచాక తాను ఐదేళ్లలో చేపట్టబోయే భవిష్యత్ ప్రణాళికను ఇప్పటికే సిద్ధం చేసుకొని ఉంచిన నిర్ణయాలు, ఆశయాలను ఈ సందర్భంగా సాక్షికి రఘునందన్‌రావు చూపించారు. ప్రజల అండతో మళ్లీ గెలుస్తానని ధీమాను వ్యక్తం చేశారు.

సాక్షి సిద్దిపేట

బుధవారం, 29, నవంబర్, 2023

గజ్వేల్.. మరింత జిగేల్



ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్



ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన జనం

- త్వరలో ఐటీ టవర్లు, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు
- నియోజకవర్గంలో ఏకకాలంలో 'దళిత బంధు' వర్తింపు
- ట్రిపుల్ఆర్ వచ్చిందంటే.. శాటిలైట్ పట్టణంగా ఆవిర్భావం
- కొండపోచమ్మ, నాచారం ఆలయాల అభివృద్ధికి చర్యలు
- గజ్వేల్ 'ప్రజా ఆశీర్వాద సభ'లో ముఖ్యమంత్రి కేసీఆర్

గజ్వేల్: తనకు జన్మనిచ్చిన సిద్దిపేట గడ్డ తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోస్తే.. కొట్లాడి సాధించుకున్న స్వరాష్ట్రాన్ని తీర్చిదిద్దడానికి గజ్వేల్ ముఖ్యమంత్రిగా తనకు అవకాశం కల్పించిందని సీఎం కేసీఆర్ అన్నారు. త్వరలోనే ఈ ప్రాంతం ఐటీ టవర్లు, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలతో కొత్త కళను సంతరించుకోనున్నదని వ్యాఖ్యానించారు. మంగళవారం తన సొంత నియోజకవర్గం గజ్వేల్‌లో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ ప్రసంగించారు. హైదరాబాద్ నగరానికి అతి సమీపంలో ఉన్న గజ్వేల్ అభివృద్ధికి అపారమైన అవకాశాలున్నాయని చెప్పారు. ప్రత్యేకించి ఐటీ రంగంలో ఈ నియోజకవర్గాన్ని తీర్చిదిద్దడానికి అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని ఐటీ మంత్రి కేటీఆర్‌ను ఇప్పటికే ఆదేశించగా... ఆ కార్యాచరణ వేగవంతమవుతోందన్నారు. కొద్ది రోజుల్లోనే కాలుష్య రహిత ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు డజను వరకు రాబోతున్నాయని అన్నారు. ట్రిపుల్ఆర్ (రీజినల్ రింగురోడ్డు)తో గజ్వేల్ అనుసంధానమయ్యే అవకాశమున్నందువల్ల అభివృద్ధి మరింత వేగవంతం కావడానికి అవకాశముందని తెలిపారు. శాటిలైట్ టౌన్‌గా ఈ ప్రాంతం ఆవిర్భవించనుందని స్పష్టం చేశారు.

అభివృద్ధికి అధ్యయన కేంద్రంగా..

నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి.. ఇతర రాష్ట్రాలకు, జిల్లాలకు అధ్యయన కేంద్రంగా ఆవిర్భవించిందని కేసీఆర్ చెప్పారు. ఇక్కడ నిర్మించిన 'మిషన్ భగీరథ' హెడ్‌వర్క్స్ ప్రాంతాన్ని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు చూసి వెళ్తున్నారని తెలిపారు. కొండపోచమ్మసాగర్, మల్లన్నసాగర్ రిజర్వాయర్లతో ఈ ప్రాంతం పసిడిపంటలకు కేంద్రమైందన్నారు. 50టీఎంసీల సామర్థ్యంతో మల్లన్నసాగర్ ఆసియాలోనే అతిపెద్ద మ్యాన్‌మేడ్ రిజర్వాయర్ అని, గొప్ప పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ముంపు బాధితుల త్యాగం వెలకట్టలేనిదని, వారిని ఎల్లవేళలా కడుపులో పెట్టుకొని కాపాడుకుంటామని హామీ ఇచ్చా రు. గజ్వేల్ నియోజకవర్గంలోని దళితులందరికీ ఏకకాలంలో 'దళితబంధు' వర్తింపజేస్తామని హామీ ఇచ్చారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ హామీని వెంటనే అమలు చేస్తామన్నారు.

కేసీఆర్ ప్రాతినిధ్యం గజ్వేల్‌కు వరం

కేసీఆర్ ప్రాతినిధ్యం గజ్వేల్‌కు వరంగా మారిందని, అభివృద్ధిలో ఈ నియోజకవర్గం ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మూడోసారి కేసీఆర్‌ను ఇక్కడి నుంచి పోటీ చేసి సీఎంగా అధికారాన్ని చేపట్టబోతుండడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామాలను తయారు చేయడానికి కేసీఆర్ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నారని



మాట్లాడుతున్న వంటేరు

చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్‌పై మరింత దయ చూపాలని కోరారు. ఐటీ టవర్ల నిర్మాణంతో పాటు కొండపోచమ్మ, నాచారంగుట్ట ఆలయాల అభివృద్ధి, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ నిర్వాసితుల సమస్యల పరిష్కారం, నిర్వాసితుల ఉపాధికి పరిశ్రమలు, తూప్రాన్‌లో వెజిటేబుల్ మార్కెట్ ఏర్పాటు, పెండింగ్‌లో ఉన్న మరికొన్ని సమస్యలు కూడా పరిష్కరించాలని కోరగా కేసీఆర్ సానుకూలంగా స్పందించారు. సభలో హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మడుపు భూంరెడ్డి, ఫుడ్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి ప్రసంగించారు. బీఆర్ఎస్ సెక్రటరీ జనరల్ కె. కేశవరావు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, సీనియర్ నేత, మాజీ జెడ్పీ చైర్మన్ లక్ష్మీకాంతారావు, మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి, మెదక్ జెడ్పీ చైర్మన్ హేమలతాశేఖర్‌గౌడ్, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, గజ్వేల్, ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్లు మాదాసు శ్రీనివాస్, జహంగీర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.